# టీబీజీకేఎస్‌ని గెలిపించాలి

- టీబీజీకేఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ మల్రాజు శ్రీనివాసరావు



వర్క్‌షాప్ వద్ద మాట్లాడుతున్న టీబీజీకేఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు

తాండూర్, డిసెంబర్ 13 : సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్)ని గెలిపించాలని బెల్లంపల్లి ఏరియా తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం వైస్ ప్రెసిడెంట్ మల్రాజు శ్రీనివాసరావు కోరారు. బుధవారం బెల్లంపల్లి ఏరియాలోని వర్క్ షాప్‌లో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో టీబీజీకేఎస్ నాయకులతో కలిసి పాల్గొని కార్మికులతో మాట్లాడారు. ఏరియాలోని వర్క్ షాప్ ఉద్యోగులకు టీబీజీకేఎస్ నాయకత్వం ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి సమస్యలు తీర్చామని అన్నారు. కేసీఆర్ నాయకత్వంలో సింగరేణి ఉద్యోగులకు ఎన్నో రకాల హక్కులు ఇప్పించామని ముఖ్యంగా తండ్రుల ఉద్యోగం కొడుకులకు, ఉచిత విద్యుత్, గృహ రుణ వడ్డీ మాఫీ, తల్లిదండ్రులకు ఉచిత వైద్య సౌకర్యం లాంటి ఎన్నో హక్కులను కల్పించినట్లు తెలిపారు. లాభాల వాటా తెలంగాణ ప్రభుత్వ హయాంలో 14 శాతం నుంచి 32 శాతానికి పెంచిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. సింగరేణి కార్మికుల ఎన్నో హక్కులు, ఉద్యోగాలు పోగొట్టిన చరిత్ర జాతీయ సంఘాలదనీ, కార్మికులకు ఎన్నో హక్కులు సాధించిన ఘనత టీబీజీకేఎస్‌దేనన్నారు. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం బాణం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఏరియా వర్క్ షాప్ కార్మికులను కోరారు. ఈ సమావేశంలో టీబీజీకేఎస్ సెంట్రల్ కమిటీ నాయకులు సంగెం ప్రకాశ్ రావు, దరావత్ మంగీలాల్, మాజీ ఉపాధ్యక్షుడు నల్లగొండ సదాశివ్, ఏరియా నాయకులు రాజేశం, కుమారస్వామి, పిట్ కార్యదర్శి కందుల తిరుపతి, అసిస్టెంట్ పిట్ కార్యదర్శులు ములకల చంద్రయ్య, వైకుంఠం, నాయకులు లక్ష్మీనారాయణ, రసూల్, కృష్ణ, శ్రీనివాస్, పాషా, వెంకటస్వామి, రామయ్య, రాజం, వీరు, హరి సింగ్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు

**నేడు టీబీజీకేఎస్ గేట్ మీటింగ్**

బెల్లంపల్లి, డిసెంబర్ 13: పట్టణంలోని శాంతిఖని గని ఆవరణలో గురువారం ఉదయం ఏడు గంటలకు టీబీజీకేఎస్ గేట్ మీటింగ్ నిర్వహించనున్నట్లు ఆ సంఘం గని పిట్ కార్యదర్శి దాసరి శ్రీనివాస్ తెలిపారు. మైన్ కమిటీ, సేఫ్టీ కమిటీ, కార్మికులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## చెన్నూర్‌లో కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తాం

- ఎమ్మెల్యే జీ వివేక్ వెంకటస్వామి



కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వివేక్

చెన్నూర్, డిసెంబర్ 13: హైదరాబాద్ కార్పొరేట్ దవాఖానాల్లో లభించే వైద్యాన్ని చెన్నూర్‌లో ప్రజలకు అందుబాటులో ఉంచుతానని ఎమ్మెల్యే జీ వివేక్ వెంకటస్వామి అన్నారు. చెన్నూర్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం మహాలక్ష్మి పథకం, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాలను ప్రారంభించి, లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెన్నూర్ ప్రభుత్వ దవాఖానలో డాక్టర్లు, సిబ్బందిని నియమించేందుకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రితో మాట్లాడుతానని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు విచారణలో బ్యాక్ వాటర్‌తో ముంపు అంశం కూడా చేర్చాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరుతానని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీని రూ.10 లక్షలకు పెంచడం, ఉచిత బస్సు ప్రయాణం ప్రజలకు మేలు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, కలెక్టర్ బదావత్ సంతోష్, జిల్లా వైద్యాధికారి సుబ్బారాయుడు, పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## భవిత కేంద్రంలో వైద్య పరీక్షలు

తాండూర్, డిసెంబర్ 13 : మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో 0–18 సంవత్సరాల వయస్సు గల ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు సోమవారం నుంచి శుక్రవారం వరకు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ కోరారు. భవిత కేంద్రంలో బుధవారం నిర్వహించిన వైద్య పరీక్షల శిబిరాన్ని ఎంఈవో పరిశీలించారు. తప్పకుండా పిల్లలను తీసుకొని రావాలని కోరారు. ప్రతి నెలలో ప్రతి బుధవారం నాడి వ్యవస్థ లోపం, ఆర్థోపెడిక్ సమస్యలు గల పిల్లలకు ఫిజియోథెరపిస్ట్ ఎస్ వెంకటేశ్ వైద్య సేవలందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీఎస్ ఐబీ ప్రధానోపాధ్యాయుడు బీ రవీందర్, ఐఈఆర్పీలు ఆర్ వెంకటేశ్వర్లు, డీ సతీశ్, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అన్నదానం

బెల్లంపల్లిరూరల్, డిసెంబర్ 4: బెల్లంపల్లి మండలంలోని బుగ్గ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో సోమవారం కన్నాలకు చెందిన బియ్యాల శంకర్, సుగుణ దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. ప్రతి సోమవారం ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్నదానం కొనసాగిస్తున్నట్లు ఆలయ చైర్మన్ మాసాడి శ్రీదేవిశ్రీరాములు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చెన్నూర్ రూరల్, డిసెంబర్ 13: మండలంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బండారి సత్యనారాయణ అన్నారు. చెన్నూర్ మండలంలోని నాగాపూర్ గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాన్ని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అన్నల తిరుపతితో కలిసి ఆయన ప్రారంభించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దాద ఓదెలు, శ్రీనివాస్, బిరుదు రవి రైతులు పాల్గొన్నారు.

## సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

భీమారం, డిసెంబర్ 13 : సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ విశ్వంబర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎల్‌సీసీ)నామని మహేశ్వర్ తెలిపారు. భీమారం మండలంలోని పోలంపల్లిలో బుధవారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమ, ప్రధాన మంత్రి సురక్ష బీమా నమోదు చేయించాలని తెలిపారు.

## పీజీ కళాశాల ఏర్పాటు చేయాలని వినతి

బెల్లంపల్లి, డిసెంబర్ 13: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీజీ కళాశాల ఏర్పాటు చేయాలని సీనియర్ డిగ్రీ విద్యార్థులు కోరారు. ఈ మేరకు బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏడాదీ కళాశాల నుంచి 300 మంది ఉత్తీర్ణులవుతున్నారని గుర్తు చేశారు. సానుకూలంగా స్పందించిన ప్రిన్సిపాల్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

## వైభవంగా అయ్యప్ప పడిపూజ



తాండూర్‌లో అయ్యప్పకు అభిషేక పూజలు నిర్వహిస్తున్న పూజారి దూబే సాయికృష్ణ శర్మ

తాండూర్, డిసెంబర్ 13 : తాండూర్ ఐబీలోని సురభి గోదాక్షేత్ర గార్డెన్స్‌లో మంగళవారం రాత్రి అయ్యప్ప భక్తులు అయ్యప్ప స్వామి పడిపూజను ఘనంగా నిర్వహించారు. రెబ్బెనకు చెందిన గురుస్వామి కిరణ్‌శర్మ 18వ సారి మాలధారణను పురస్కరించుకొని నిర్వహించిన ఈ పడిపూజ కార్యక్రమానికి ఆదిలాబాద్‌కు చెందిన తాంత్రిక పూజారి దూబే సాయికృష్ణ శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు, అల్పాహారం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో తాండూర్, తిర్యాణి, రెబ్బెన మండలాలకు స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న పట్టణ ఎస్ఐ బీ రాజశేఖర్

రామకృష్ణాపూర్, డిసెంబర్ 13: ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ రాజశేఖర్ అన్నారు. రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజీవ్‌చౌక్‌లో వాహనదారులకు బుధవారం సాయంత్రం అవగాహన కల్పించారు. వాహనదారులు సరైన పత్రాలు కలిగి ఉండాలని, చిన్నపిల్లలకు వాహనాలు ఇవ్వద్దని, బైక్ నడిపేవారు హెల్మెట్ ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడుపవద్దని సూచించారు. పట్టణంలో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ నూనె శ్రీనివాస్, పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## భీమారం టేకు వనం లో టేకు చెట్ల నరికివేత





అటవీ ప్రాంతంలో నరికి ఉన్న టేకు వృక్షం

భీమారం, డిసెంబర్ 13 : మంచిర్యాల జిల్లా భీమారం సెక్షన్ పరిధిలోని భీమారం అర్కపల్లి అటవీ ప్రాంతంలో టేకు చెట్లు నరికి వేశారు. కొంత కాలంగా ఇక్కడ టేకు చెట్లను యథేచ్ఛగా నరుకుతున్నట్లు ఆనవాళ్లు ఉన్నాయి. భారీ టేకు చెట్లను రంపాలతో కోసిన ఆనవాళ్లున్నాయి. అటవీశాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎన్‌టీఎస్‌హెచ్ ప్లాంటేషన్‌కు కూతవేటు దూరంగా ఈ వ్యవహారం నడిచింది. పదుల సంఖ్యలో టేకు భారీ వృక్షాలు నరికి ఎత్తుకెళ్లారు. ఇప్పటికైనా అటవీ అధికారులు స్పందించి అటవీ సంపదను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

## అంబులెన్స్ సౌకర్యం కల్పించండి

భీమారం, డిసెంబర్ 13 : మండల కేంద్రంలో అంబులెన్స్ సౌకర్యం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ యువ నాయకుడు కొక్కుల నరేశ్, సందనవేణి అజయ్, ఆవిడపు రవితేజ, వీరబోయిన రమేశ్, పూసాల రమేశ్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామికి వినతి పత్రం అందజేశారు.

## ఎల్లమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్

చెన్నూర్ రూరల్, డిసెంబర్ 13: చెన్నూర్ నియోజకవర్గ ప్రజలు సంతోషంగా ఉండాలని శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లిని కోరుకున్నట్లు చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి తెలిపారు. కిష్టంపేట గ్రామంలో గౌడ కులస్థుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవి విగ్రహ ప్రతిస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వివేక్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు మూల రాజిరెడ్డి, కిష్టంపేట, సుద్దాల గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

చెన్నూర్ రూరల్, డిసెంబర్ 13: మండలంలోని సోమన్‌పల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రొటోకాల్ పాటించడం లేదని, ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నదని చర్యలు తీసుకోవాలని సోమన్‌పల్లి సర్పంచ్ భీమిని శారద, ఎంపీటీసీ తుమ్మల లావణ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ప్రజాప్రతినిధులకు సమాచారం అందించకుండా క్రికెట్ కిట్‌ను క్రీడాకారులకు పంపిణీ చేశారని తెలిపారు. ఈ విషయంపై ఎంపీడీవోకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

## ఆర్టీసీ బస్సు ప్రారంభం

వేమనపల్లి, డిసెంబర్ 13 : బెల్లంపల్లి నుంచి వేమనపల్లి మండలానికి ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు బుధవారం ప్రారంభమైంది. జిల్లెడ గ్రామానికి చేరుకోగానే కాంగ్రెస్ నాయకులు స్వాగతం పలికారు. బస్సు సౌకర్యం కల్పించాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలిపారు. డిపో అధికారులతో మాట్లాడి వేమనపల్లి మండలానికి బస్సును ఎమ్మెల్యే వేయించారని తెలిపారు. బస్సు వచ్చేలా కృషి చేసిన ఎంపీటీసీ సంతోష్‌కుమార్‌కు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు షాబీర్ అలీ, నాయకులు రాంచందర్, శంకర్, సుధాకర్‌రెడ్డి, భగవంత్, దాసు, చంద్రశేఖర్, శంకర్, సమ్మిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి పని దినాలను పెంచాలి

వేమనపల్లి, డిసెంబర్ 13 : గ్రామాల్లో ఉపాధి హామీ పని దినాలను పెంచాలని ఎంపీడీవో లక్ష్మయ్య సూచించారు. బుధవారం వేమనపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఉపాధి కొత్త పనుల ఎంపిక, నర్సరీల్లో మొక్కల పెంపకం, వంద శాతం పన్నులు వసూలుపై సూచనలు చేశారు. ఎంపీవో శ్రీపతి బాపు, ఏపీవో సత్యప్రసాద్, ఈసీ మధూకర్, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.